క్లుప్తంగా

చెల్లాపూర్‌లో కులగణన సర్వే పూర్తి



సర్వేపత్రాలను ఎంపీడీఓ రామకృష్ణకు అందజేస్తున్న ఆనంద్, దస్తయ్యలు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలో సమగ్ర కులగణన సర్వే పూర్తిచేసినట్లు చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుప్పలి ఆనంద్‌కుమార్ ఎంపీడీఓ రామకృష్ణకు సర్వే పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. చెల్లాపూర్‌లో 430 కుటుంబాల సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు సర్వేను త్వరితగతిన పూర్తి చేసి తమకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, ఉపాధ్యాయులు దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



ఎన్యుమరేటర్లతో శ్రీనివాస్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని సీనియర్ నాయకుడు ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల శివారులోని ఆయన నివాసంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు అడిగిన ప్రశ్నలకు తగిన వివరాలు వెల్లడించారు. సమగ్ర సర్వేతో పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరగనుందన్నారు. రానున్న కాలంలో అమలు చేసే సంక్షేమ పథకాలకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సర్వే పత్రాలను అధికారులకు అందజేశారు.

టీఎంటీఎఫ్ అధ్యక్షుడిగా వెంకటయ్య



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

పరిగి: తెలంగాణ మహా ఆదిగా ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎంటీఎఫ్) నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, గౌరవ అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా బాలమణి, కోశాధికారిగా నర్సింహులు, అసోసియేషన్ అధ్యక్షుడిగా జంగయ్యలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడారు. విద్యావ్యవస్థలో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి, సామాజిక, అసమానతలను తొలగించడానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా వ్యతిరేక పాలన

తాండూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని ఎస్‌ఎస్‌టీపీ ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫోర్త్ సిటీ పేరిట రియల్ వ్యాపారానికి సిద్ధమైందని ఆరోపించారు. ముచ్చర్లలో ఫార్మా సిటీని తరలించి కొడంగల్ నియోజకవర్గంలోని పచ్చని గ్రామాలలో ఫార్మా సిటీ ఏర్పాటు చేసేందుకు అధికారులతో కలిసి భూములను సేకరించేందుకు చూశారన్నారు. ఫార్మాబాధిత గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన చేపడుతుంటే లగచర్ల ఘటన వెనుక కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి కుట్ర చేశారనే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

ప్రియాంక గాంధీ విజయంపై సంబరాలు

కుల్కచర్ల: వయనాడ్ ఎంపీ నియోజకవర్గంలో ప్రియాంక గాంధీ విజయం సాధించడంతో కుల్కచర్ల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. దేశం మొత్తంగా రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు.

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వద్దు

- భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీఓలు, తహసీల్దార్లు
- పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అధికారులు



తాండూరు రూరల్: బిజ్వార్ పాఠశాలలో భోజనం చేస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తాండూరు మండలంలోని బిజ్వార్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడారు. నారాయణపేట్ జిల్లా మగనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలుషితాహారం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలిచివేసిందన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక నుంచి వారంలో మూడు రోజులు పాఠశాలలను తనిఖీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాజీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఊరికి ఓ ప్రత్యేకాధికారి..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల, రెసిడెన్షియల్, కేజీబీవీల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసేందుకు ఒక్కో ఊరికి ఓ ప్రత్యేకాధికారిని నియమిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. వారంలో మూడు రోజులు పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా వారిని ఆదేశించినట్లు చెప్పారు.

పౌష్టికాహారం వడ్డించాలి

మోమిన్‌పేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పౌష్టికాహారం పెట్టాలని మండల ప్రత్యేకాధికారి సదానందం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బియ్యంలో పురుగులు ఉన్నట్లయితే వెంటనే తిరిగి వాపసు పంపించాలన్నారు. పురుగులు లేకుండా మంచి బియ్యం దిగుమతి చేసుకొని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలన్నారు. ప్రతి రోజు మెను ప్రకారం కూరగాయలు, పప్పు, గుడ్లు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: కోట్‌పల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కుల్కచర్లలో..

కుల్కచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చౌడాపూర్ మండల ఇంచార్జి తహసీల్దార్ వెంకటేశ్ చారి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు రఘు, విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

బంట్వారం: మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. శనివారం ఆయన మధ్యాహ్న భోజన కమిటీ బృందంతో కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వంటలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దానియల్, డీటీ మహ్మద్ యూనిస్ పాల్గొన్నారు.



కుల్కచర్ల: మధ్యాహ్న భోజనం చేస్తున్న ఇంచార్జి తహసీల్దార్ వెంకటేశ్ చారి



మోమిన్‌పేట: ప్రాథమిక పాఠశాలలో బియ్యం పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సదానందం

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొడంగల్ రూరల్: నాణ్యమైన సరుకులతో విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ బి విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం క్రమం తప్పకుండా విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు.



కొడంగల్ రూరల్: సహపంక్తి భోజనం చేస్తున్న విజయ్‌కుమార్, బలరాం నాయక్

ప్రైవేటుకు దీటుగా విద్యనందించాలి



దోమ: ఊటుపల్లి పాఠశాలలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా విద్యనందించాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. దోమ మండల పరిధిలోని ఊటుపల్లి పాఠశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగృతి బలోపేతానికి కృషి చేద్దాం

నియోజకవర్గ కన్వీనర్ దత్తాత్రేయ

తాండూరు టౌన్: తాండూరు నియోజకవర్గంలో తెలంగాణ జాగృతి సంస్థ బలోపేతానికి కృషి చేయనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ దత్తాత్రేయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాగృతి కార్యకర్తల సమావేశంలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాద పూర్వకంగా కలిశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు పలు విభాగాల జాగృతి సంస్థ కమిటీలు వేయనున్నట్లు ఆమె చెప్పారన్నారు. సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారన్నారు. ఈమేరకు నియోజకవర్గంలో జాగృతి సంస్థను బలోపేతం చేయనున్నట్లు ఆయన శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.



తాండూరు టౌన్: కవితకు బొకే ఇస్తున్న నియోజకవర్గ కన్వీనర్ దత్తాత్రేయ తదితరులు

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు, మండలంలోని గౌతపూర్ గ్రామానికి చెందిన శకుంతల కలిశారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కవితను మర్యాద పూర్వకంగా కలిసి ఆమెతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాండూరుకు చెందిన జాగృతి నాయకులు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న వెంకటేశం

బంట్వారం: సీఎం సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. శనివారం మండల పరిధిలోని బొప్పునారం గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును వెంకటేశం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రి, వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులు మృతికి సంతాపం

అనంతగిరి: తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం వ్యక్తం చేశారు. తనకు అత్యంత సన్నిహితులని, ఆయన సేవా భావన, నమ్రత, వినయం కలిగిన నాయకులని, తాండూరు పట్టణ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని పలు కాలనీల్లో అమృత్ 2.20 నిధులతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి శనివారం స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. త్వరలోనే మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి పనులు ప్రారంభిస్తామన్నారు. అమృత్ 2.20 నిధులతో రూ.16కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తాహేర్, ఎర్రగడ్డపల్లి కృష్ణ ఆయాకాలనీల ప్రజలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- ఆలస్యంగా ఎమ్మెల్యే రాక
- ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారులు

కుల్కచర్ల: పాలకుల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయన రాకకోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. అప్పటికే దూర ప్రాంతానికి చెందిన మహిళలు ఒంటిగంటకే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. 2గంటల అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చెక్కుల పంపిణీకి ముందు చేయాల్సిన సంతకాల సేకరణను లబ్ధిదారులతో పూర్తి చేయించారు. దీంతో 3గంటలకు రావాల్సిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వివిధ కారణాల నేపథ్యంలో ఆలస్యంగా వచ్చారు. అదికాస్తా రాత్రి వరకు కార్యక్రమం నిర్వహించడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

104మందికి చెక్కులు పంపిణీ ..

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 104మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడారు. తహసీల్దార్ మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కుమ్మరి స్వామి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఆర్డీఓ వాసుచంద్ర

కుల్కచర్ల: రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఆర్డీఓ వాసుచంద్ర పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్లను పరిశీలించి వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలుర పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అక్కడ నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వాసుచంద్ర

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి



తాండూరు రూరల్: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్



కొడంగల్ రూరల్: ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: అర్హులు ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో కొత్త ఓటరు నమోదు డ్రైవ్‌ను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తారాసింగ్ మాట్లాడారు. 2025, జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ నెల 28లోపు కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

కొడంగల్ రూరల్: పట్టణంలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 237, 238, 239, ప్రాథమిక పాఠశాలలోని 240 ఓటరు నమోదు కేంద్రాలను ఆయన రిశీలించారు. ఓటరు జాబితాలో నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని గడ్డమీది గంగారం పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు ఒకరోజు డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పీఈటీగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, మాజీ సర్పంచు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు వినతి

కొడంగల్ రూరల్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని ఎన్‌పీఆర్‌డీ డివిజన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జె దశరథ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అమలు చేయాలన్నారు. జీఓ 17ను రద్దు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు హనుమేశ్, సావిత్రమ్మ, మారుతి, విశ్వమ్మ, ప్రభాకర్, విశ్వప్ప తదితరులు పాల్గొన్నారు.



బలరాంనాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌పీఆర్‌డీ డివిజన్ కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జన్మదిన వేడుకలు

కొడంగల్ రూరల్: శ్రీసత్యసాయి జన్మదిన వేడుకలను సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, శ్రీరాఘవేంద్ర నర్సింగ్ హోమ్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

వికారాబాద్ అర్బన్‌లో...

వికారాబాద్ అర్బన్: శ్రీసత్యసాయి జ్ఞానకేంద్రం వికారాబాద్‌లో వైభవంగా నిర్వహించారు. ఉదయం సంకీర్తన, స్వామి వారికి పూజాభిషేకం, అనంతరం గీతావాహిని బృందం భగవద్గీత పారాయణం చేశారు. మా శారదా ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సతీష్ చంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భగవద్గీత మానవ సమాజానికి సత్యాన్ని బోధిస్తుందన్నారు. మానవ జన్మ ఎన్నో జన్మల పూర్వ కర్మల ఫలితమన్నారు. సృష్టిలో శాశ్వతమైనది సత్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో గీతా వాహిని బృందం సభ్యులు శ్రీదేవి, జయశ్రీ, లావణ్య, కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్, డివైసీ బసవేశ్వర్, కెరెల్లి కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ప్రేమ్‌కుమార్, సేవాదళ్ సభ్యులు వేణుగోపాల్, సుధీర్, శ్రీనాథ్, రవి చారి, శ్రావణ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అనంతగిరి: వికారాబాద్ పట్టణం 32వ వార్డులో శనివారం ఎంఐఎం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ మాట్లాడారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షరీఫ్, ఇమ్రాన్, జలీల్, షైబాజ్ ఖాన్, రఫీ, రవీందర్, ఆబిద్, ఇస్మాయిల్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ 26న ప్రజాపాలన దినోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 26న ప్రజాపాలన దినోత్సం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సంబంధించి నూతన పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

◆ ధారూరు మార్కెట్‌కు 1510 సంచుల వడ్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వరిలో 1010 రకం ధాన్యం 1,510 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 2,210 నుంచి రూ. 2,250 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. 688 సంచుల మొక్కజొన్నకు బీట్లలో క్వింటాల్‌కు రూ. 2,400 నుంచి రూ. 2,520 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె తెలిపారు. వరిలో సోన రకం 1,861 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ.2,720 వరకు ధర పలికిందన్నారు.

◆ 26న నిరసన ప్రదర్శనలు

అనంతగిరి: నరేంద్ర మోదీ సర్కార్ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసనను విజయవంతం చేయాలని పలువురు వామపక్ష కార్మిక సంఘాల జిల్లా ముఖ్య నాయకులు తెలిపారు. శనివారం వికారాబాద్‌లో వామపక్ష పార్టీల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు పీర్ మహమూద్, బీఆర్‌టీయూ కృష్ణయ్య, సీఐటీయూ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆహ్లాదకరంగా వనభోజనాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని గండిచెరువు, తుపాకుల తండా పాఠశాలలోని విద్యార్థులు శనివారం ఆహ్లాదకరమైన వాతావరణంలో వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా గండిచెరువు తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితమ్మ మాట్లాడారు. విద్యార్థుల మానసికోల్లాసానికి వనభోజనాల కార్యక్రమం నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని దేవాలయంలో వనభోజనాలను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి, పచ్చదనం వంటి పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తుపాకుల తండా ప్రధానోపాధ్యాయురాలు నవనీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం అందజేత

దౌల్తాబాద్: మండలంలోని భాగ్యతండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబానికి ఐసీడీఎస్ తరఫున సీడీపీఓ రజిత, సూపర్‌వైజర్లు మంజుల, పార్వతిదేవిలు మృతురాలి కుటుంబసభ్యులకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు.